క్లుప్తంగా

వేలం వాయిదా

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా టెంకాయలు అమ్ముకోవడానికి హక్కుల కోసం ఆదివారం వేలం పాట నిర్వహించారు. అయితే ఎవరూ ముందుకురాకపోవడంతో వాయిదా పడింది. ఈనెల 18వ తేదీ మరోసారి వేలం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, చిన్నాయప్ప తెలిపారు.

15లోగా ఈకేవైసీ చేయించుకోండి

మద్దికెర: రబీ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ రవి తెలిపారు. మండలంలోని ఆయా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించి వేలిముద్ర వేయాలని సూచించారు. పెరవలి, మద్దికెర గ్రామాల్లో అధికంగా ఉన్నారని.. త్వరితగతిన ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు. వలంటీర్లు, వీఏఏలు ఈకేవైసీతో కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



తమలపాకుల అలంకరణలో స్వామివారు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్ మూర్తులను తమల పాకులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన వాయిదా

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవానికి సోమవారం రావాల్సిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటన వాయిదా పడినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగారెడ్డి ఆదివారం తెలిపారు. ప్రారంభోత్సవ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

నివాళి

తుగ్గలి: మండల పరిధిలోని పి.కొత్తూరుకు చెందిన సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, మద్దిలేటిరెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకరరెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ సైనికోద్యోగులకు సన్మానం



రిటైర్డు జవాన్లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పత్తికొండ రూరల్: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గ్రామానికి చెందిన రిటైర్డు సైనికోద్యోగులు సురేష్ బాబు, నరసింహులుయాదవ్, మల్లికార్జునయ్య, వీరశేఖర్‌స్వామిలను బీజేపీ నాయకులు సన్మానించారు. పార్టీ నాయకులు పూనామల్లికార్జున, దండిమల్లికార్జున, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

జాతరకు ముమ్మర ఏర్పాట్లు



తేరుబజారులో ముళ్లకంపలను తొలగిస్తున్న నిర్వాహకులు

హొళగుంద: మండల కేంద్రంలో ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే హొళగుంద సిద్దేశ్వరస్వామి జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు.. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ చలవాది రంగమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక తేరుబజారులో ముళ్లకంపలు, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. రథోత్సవం, లంకా దహనం తదితర కార్యక్రమాలను భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా భక్తులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న పాలనలో ప్రతి ఇంటా ఆనందం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరు: వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో గోనెగండ్ల, నందవరం మండలాల పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ..ఈ ప్రభుత్వ పాలనలో 90 శాతం ప్రజలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. ప్రతి కుటుంబానికీ ఏదో ఒక మేలు జరిగిందన్నారు.అభివృద్ధి పనులు, సంక్షేమ పాలన ఇలానే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే 'సిద్ధం' కార్యక్రమం విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను నమ్మొద్దు

సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. అసత్య ఆరోపణలు, హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారని.. ప్రజలు గమనించాలని కోరారు. వారి కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ఆరోపణలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. తగిన సమయంలో టీడీపీ నాయకులకు బుద్ధిచెబుతారని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు దగ్గర పడడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తం కావాలన్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఆయన కుమారుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో జరిగే పెళ్లి కార్యక్రమంలో బిజీగా ఉన్నారని తెలిపారు. దీంతో అందుబాటులో ఉన్నవారితో సమావేశాలు ఏర్పాటు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందవరం పార్టీ నాయకులు శివారెడ్డిగౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, కేఆర్ రామకోటేశ్వరరెడ్డి, ముగతి విరుపాక్షిరెడ్డి, సోగనూరు భీంరెడ్డి, నాగలాపురం చంద్రశేఖర్‌రెడ్డి, కందనాతి రామకృష్ణారెడ్డి, గోనెగండ్ల నాయకులు కాశిరెడ్డి, బందె నవాజ్, గిడ్డయ్య, మన్సూర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

నందవరం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బుట్టా రేణుక అన్నారు. ఆదివారం మాచాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటేశ్వరరావు కుమార్తె రాజేశ్వరి వివాహానికి ఆమె హాజరయ్యారు. ఆమెకు గ్రామస్తులు బ్యాండు మేళాలు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. నవరత్నా పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాలంటే, పేదలు మరింత అభివృద్ధి సాధించాలంటే, రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు కిష్టప్ప, విరుపాక్షిరెడ్డి, నాయకులు శివారెడ్డిగౌడ్, బుట్టా శివనీలకంఠప్ప, చాంద్ బాషా పాల్గొన్నారు.



బుట్టారేణుకతో నందవరం మండల వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బుట్టా రేణుకకు స్వాగతం పలుకుతున్న మాచాపురం గ్రామస్తులు

జగనన్న గృహప్రవేశాల్లో బుట్టారేణుక

ఎమ్మిగనూరు మండలం బోడగండ గ్రామంలోని జగనన్న కాలనీలో గృహప్రవేశాల్లో బుట్టారేణుక పాల్గొన్నారు. లబ్ధిదారులు కురువ శివలింగమ్మ, పద్మావతమ్మ ఇంటిని సందర్శించారు. పేదల సొంతింటి కలను నిజం చేసిన జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కడివెళ్ల సర్పంచ్ రంగస్వామి, బోడబండ నర్సిరెడ్డి, మల్కాపురం పెద్దయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న విరుపాక్షి

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు పంచాయతీ మజార గ్రామమైన సంగాలలో రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ పనులను వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆదివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం నేమకల్లు, సంగాల గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మారయ్య, సర్పంచ్ ప్రేమ్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు సుంకన్న, భీమలింగ, నాగేంద్ర, సత్తిరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్

మద్దికెర: మద్దికెర గ్రామంలో ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇస్తామని.. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుహాసిని తెలిపారు. నీటి సమస్యతో ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఉచితంగా నీటి కనెక్షన్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే 2023-24 ఏడాదికి సంబంధించి ఇంటి పన్ను పూర్తి స్థాయిలో చెల్లించి ఉండాలన్నారు. వివరాల కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వేడుకగా పామయ్యతాత తిరుణాల

- నేడు బండలాగుడు పోటీలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే



తిరుణాలలో భక్తుల సందడి



పామయ్యతాత సమాధి వద్ద పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పామయ్యతాత తిరుణాల ఆదివారం ఘనంగా జరిగింది. గురుశిష్యుల బంధానికి ప్రతీకగా, బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం గ్రామాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధంగా ఈ తిరుణాలకు పేరుంది. బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన పామయ్యతాత శిష్యుడైన నార్లాపురం పెనికలపాటి హనుమంతయ్య వంశీయుల తొలి నైవేద్యం, తాత వంశీయులైన బొమ్మిరెడ్డిపల్లె వారసుల పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం, అల్లుగుండు, మల్లెపల్లె, వెల్దుర్తితో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తాత సమాధి వద్ద పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకాలంకరణ, నందికోలసేవ, చెక్కభజనలతో కనుల పండువగా జరిగింది. తిరుణాల నిర్వాహకులు సర్పంచ్ సునీతారెడ్డి, మధుసూదన్ రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రపాణిరెడ్డి, సూర్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, రంగయ్య, భాస్కర్‌నాయుడు, భాస్కర్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

పామయ్యతాత తిరుణాల్లో భాగంగా బొమ్మిరెడ్డిపల్లెలో సోమవారం నిర్వహించనున్న ఎడ్ల బండలాగుడు పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30లకు జరిగే ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

మహానందిలో సండే సందడి

మహానంది: సెలవు రోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం జరిగిన అభిషేకం, అష్టవిధ మహా మంగళ హారతుల సమయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహానందీశ్వర స్వామి దర్శనం నిర్విరామంగా కొనసాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శరవేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయం



పూర్తికావస్తోన్న రైతు భరోసా కేంద్రం

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయం, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ పనులను పీఆర్ అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పూర్తిగా చెల్లించడంతో పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రానికి(ఆర్బీకే) రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ సెంటర్‌కు రూ.17.18 లక్షలు నిధులు మంజూరు చేసింది. గ్రామ సచివాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రైతు భరోసా కేంద్రం ఈనెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

శాంతి మార్గమే ప్రపంచానికి ఆదర్శం

కౌతాళం: శాంతి మార్గంతోనే సమసమాజస్థాపన సాధ్యమని పాల్తూరు మఠం పీఠాధిపతి చెన్నవీర శివచార్య సాములు, హాల్వి మఠం పీఠాధిపతి మహంతస్వామి, రౌడూకుంద మఠం పీఠాధిపతి శివయోగి మహాస్వాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలో భక్తుల విరాళాలతో నూతనంగా నిర్మించిన త్రింభాకేశ్వర స్వామి ఆలయాన్ని ఈనెల 22వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి నుంచి 11రోజుల పాటు 21వ తేదీ వరకు బసవేశ్వరస్వామి పురాణ ప్రవచన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అధ్యాత్మిక కార్యక్రమాల వల్ల గ్రామాల్లో శాంతి, సోదరభావం ఏర్పడుతుందన్నారు. పురాతన దేవాలయ స్థానంలో నూతన ఆలయాన్ని గ్రామస్తులంతా కలిసికట్టుగా విరాళాలు సేకరించి నిర్మించడం గొప్ప విషయమన్నారు. 22న ఆలయ ప్రారంభోత్సవం ఉంటుందని కమిటీ నిర్వహకులు తెలిపారు. అలాగే ప్రత్యేక హోమాలు, విశేష పూజల అనంతరం గణపతి, త్రింభాకేశ్వరస్వామి, పార్వతి దేవిళ్ల విగ్రహాలతో పాటు వివిధ దేవతల విగ్రహాల ప్రతిష్ఠోత్సవం జరిపిస్తామని చెప్పారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతులు

ఘనంగా భీరప్పస్వామి దేవర



పల్లకీపై ఊరేగుతున్న భీరప్పస్వామి

గోనెగండ్ల: మండల కేంద్రంలో భీరప్పస్వామి దేవర ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం తుంగభద్ర దిగువ కాలువ దగ్గర ఉన్న కాశీవిశ్వేర దేవాలయం నుంచి భీరప్పస్వామి వారి పల్లకి ఉత్సవం సాగింది. ఈ సందర్భంగా గొరవయ్యాల నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై స్వామివారికి పూజలు చేశారు. అలాగే సోమవారం ఉదయం హోమం, గొరవయ్యాల పూజలు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పూజారులు తెలిపారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి విరాళం



విరాళం ఇస్తున్న బుసినె విరుపాక్షి

చిప్పగిరి: సంగాల గ్రామంలోని సుంకులమ్మ అవ్వ దేవాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆదివారం రూ.50 వేల విరాళం అందించారు. ఆయనకు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచి ప్రేమ్ కుమార్, పార్టీ నేత మారయ్య తదితరులు ఉన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



పట్టుబడిన బిందెలు, డ్రమ్ములు, నాటుసారా

పెద్దకబుబూరు: మండలంలోని హనుమాపురం గ్రామంలో సారా స్థావరాలపై సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించినట్లు పెద్దకడబూరు ఎస్‌ఐ మహేష్ కుమార్ తెలిపారు. ఉదయం హనుమాపురం కొండల్లో పోలీసు సిబ్బందితో కలిసి స్థావరాలపై దాడులు చేపట్టగా 800 లీటర్ల నాటుసారా లభ్యమైందని, అలాగే నాటుసారా తయారు చేసేందుకు ఉపయోగించే పాత్రలను ధ్వంసం చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఘనంగా కనకదాసు విగ్రహావిష్కరణ



పెద్దతుంబళంలో భక్త కనకదాసు విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఆదివారం కనకదాసు రాతి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని కురువ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కనకదాసు విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కురువ కులపెద్దలు అయ్యన్న, మూకన్న, పూజారి బర్దలింగన్న, భగయ్యగారితాయన్న, భీమన్న, కారప్ప పాల్గొని కనకదాసు యొక్క చరిత్రను వివరించారు.

ఉప్పునీటిని తాగలేకున్నాం

హొళగుంద: మండల కేంద్రంలో ఇళ్లకు సరఫరా అవుతున్న ఉప్పు నీరును తాగలేకున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. హొళగుంద సమీపంలో 11 గ్రామాల తాగునీటి అవసరాలకు నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఉండి కూడా ఉప్పునీటిని తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ), ఉప్పుగా ఉంటున్న బోర్ల నీటి మిశ్రమాన్ని సరఫరా చేయకుండా ఎల్లెల్సీ నీటిని మాత్రమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని 5, 6 తదితర వార్డులతో పాటు దిడ్డి కాలనీ, కుమ్మర వీధులకు బోరు నీటిని వదలడం, కొన్ని సమయాల్లో ఎల్లెల్సీ, బోరు నీటిని కలిపి సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు గత్యంతరం లేక ఆ నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ఎల్లెల్సీ నీటిని మాత్రమే శుద్ధి చేసి గ్రామంలో సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హొళగుంద సమీపంలో నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

సర్కారీ బడి.. కార్పొరేట్ సవ్వడి



రామాపురం యూపీ స్కూల్ (నాడు)



నూతన హంగులతో రూపుదిద్దుకున్న పాఠశాల (నేడు)

తుగ్గలి: గతంలో ప్రభుత్వ పాఠశాలలంటే పాచి పట్టిన గోడలు, చెత్తాచెదారంతో నిండిన ప్రాంగణం, నేలపైనే చదువులు, విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా సక్రమంగా అందని పుస్తకాలు, అరకొర వసతులు. పాలకులు సర్కారు పాఠశాలల అభివృద్ధిని గాలికొదిలేశారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యా రంగాన్ని ప్రక్షాళన చేసింది. ఈ పరిస్థితిని రూపుమాపేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకానికి శ్రీకారం చుట్టారు. కోట్లాది రూపాయలను ఖర్చు చేసి గ్రామాల్లోని సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. మండల పరిధిలోని రామాపురం యూపీ స్కూల్‌ను నాడు-నేడు పథకం మొదటి విడత కింద రూ.17 లక్షలతో ఆధునీకీకరించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు అభివృద్ధి చేయడంతో పాటు అధునాతన ఫర్నీచర్, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, గ్రీన్‌బోర్డు ఏర్పాటు చేశారు. ప్రహరీలు పునరుద్ధరించి రంగుల బొమ్మలతో తీర్చిదిద్దారు. దీనిపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జొన్నగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 1995-96లో పదో తరగతి చదివిన వారంతా కలుసుకున్నారు. చిరునవ్వులు, అలింగనాలు, పలకరింపులతో ఆ ప్రాంగణం అహ్లాదకరంగా మారింది. చిన్న పిల్లలుగా మారి స్కూలు రోజులను గుర్తు చేసుకున్నారు. చిన్నతనంలో చేసిన చిలిపి జ్ఞాపకాలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. చక్కటి విందును ఆరగించారు. చదువు నేర్పిన ఉపాధ్యాయురాలు పార్వతిని ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు నిర్మించిన డైనింగ్ హాలును హెచ్‌ఎం ఉపేంద్ర, ఎస్‌ఐ రామాంజినేయులు, పూర్వ ఉపాధ్యాయిని పార్వతి ప్రారంభించారు.

నేడు శ్రీమార్కండేయ స్వామి జయంతి

కోసిగి: మండల కేంద్రంలో పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఆంజనేయులు తెలిపారు. స్వామి వారి జయంతిని పురస్కరించుకుని వేకువ జాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి కవచ, ఫల,పుష్పాలతో అలంకరించి పూజలు చేపడతామని చెప్పారు.



జొహరాపురంలో దగ్ధమవుతున్న గడ్డివామి



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గడ్డివామి దగ్ధం

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు కురవ భీమేష్ మారెమ్మవ్వ దేవాలయం వద్దనున్న తన పొలంలో గడ్డివామి ఉంచాడు. పైన ఉన్న విద్యుత్ తీగలు రాసుకుని నిప్పు పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో సమీప పొలంలో పనిచేస్తున్న రైతులు భీమేష్‌కు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు 70 శాతం గడ్డి కాలిపోయిందని, రూ.40 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.